
పొంగిపొర్లుతున్న యద్దనపూడిలోని పోలూరు వాగు


స్వర్ణ గ్రామంలో లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు


వాడరేవు తీరంలో మత్స్యకారులకు సూచనలిస్తున్న రూరల్ ఎస్సై శివకుమార్

జోరు వానలు.. హోరు వాగులు

- అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు
- వాహనదారుల అవస్థలు
- వేటకు వెళ్లొద్దని మత్స్యకారులకు సూచన
- ఎక్కడా కనిపించని అధికార యంత్రాంగం

చీరాల/చీరాల టౌన్: బంగాళాఖాతంలో వాయు గండం కారణంగా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో గ్రామాల్లోని అంతర్గత రోడ్లతో పాటుగా ప్రధాన రహదారులు సైతం వర్షపు నీటితో నిండి ప్రజలు, వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. మండలంలోని ప్రధాన రహదారులన్నీ వర్షం ధాటికి చెరువులుగా మారుతున్నాయి. ఈపురుపాలెం, దేవాంగపురి గ్రామాల్లోని రహదారులన్నీ వర్షం నీటితో నిండిపోయాయి. మోస్తరు వర్షం కురిస్తే చీరాల-ఒంగోలు, చీరాల-గుంటూరు ప్రధాన రహదారుల్లో ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. గత కొన్నేళ్లుగా ఈ ఈరహదారుల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కాని అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు.

■ భారీ వర్షాలకు ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్ కాలువ ఉధృతంగా మారింది. పర్చూరు నియోజకవర్గం నుంచి వర్షపు నీరు స్ట్రయిట్‌కట్ కాలువ ద్వారా వాడరేవులోని దానవాయిపేటలో సముద్రంలో కలుస్తుంది. ఎగువ ప్రాంతం నుంచి అధికంగా వరద రావడంతో కాలువలో నీటిమట్టం పెరిగిపోవడంతో స్ట్రయిట్ కట్ వెంబడి ఉన్న గ్రామాల ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. చీరాలలో 56.4 మి.మీ, వేటపాలెంలో 53.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

మత్స్యకారులు వేటకు వెళ్లకండి..

భారీ వర్షాలు, వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులు ఎవరూ సముద్రంలో వేటకు వెళ్లవద్దని పోలీస్, రెవెన్యూ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. శనివారం మండలంలోని వాడరేవు, రామాపురం సముద్ర తీర ప్రాంత గ్రామాల్లో రూరల్ ఎస్సై శివకుమార్ పర్యటించి మత్స్యకారులు వేటకు వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. అలానే శుక్రవారం వేటకు వెళ్లిన మత్స్యకారులను తిరిగి రప్పించారు. ఈదురుగాలులు, భారీ వర్షాలు కురుస్తున్నందున వేటకు వినియోగించే వలలు, బోట్లు, ఇతర సామగ్రిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. తీరంలో ఎవరూ వేటకు వెళ్లకుండా, పర్యాటకులు సముద్రం తీరానికి రాకుండా అన్నీ చర్యలు తీసుకుంటున్నామని, తీరంలో పోలీసులు సిబ్బందితో గస్తీని ఏర్పాటు చేశామని ఎస్సై తెలిపారు.

■ చీరాల పట్టణంలోని పలు రోడ్లపై మోకాలు లోతున వర్షం నీరు నిలిచింది. చర్చి కాంపౌండు సమీపంలో రోడ్డుపై వర్షం నీరు నిలిచింది. ఉదయం నుండి కురుస్తున్న వర్షం కారణంగా జన జీవనం స్తంభించింది. వర్షం కారణంగా ప్రభుత్వ, పలు ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ముసురు వానతో శివారు ప్రాంతాలలో వర్షం నీరు నిలిచింది. వేటపాలెం మండలంలో వర్షం కారణంగా పలు కాలనీలు, లోతట్టు ప్రాంతాలలో వర్షం నీరు నిలిచింది. లోతట్టు ప్రాంతాలలో ఎస్సై వెంకటేశ్వర్లు సందర్శించారు. పలు జాగ్రత్తలు, సూచనలు చేసి ప్రమాదకర పరిస్థితులు ఎదురైతే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

దంచి కొడుతున్న వానలు..

చినగంజాం/మార్టూరు/యద్దనపూడి/కారంచేడు: శుక్రవారం అర్ధరాత్రి నుంచి పర్చూరు నియోజకవర్గంలో వానలు దంచికొడుతున్నాయి. ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడుతుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శనివారం యద్దనపూడి మండలంలో అత్యధికంగా 70.6 మి.మీ నమోదు కాగా, మార్టూరు మండలంలో 58.4 మి.మీ, కారంచేడు 65.4 మి.మీ, పర్చూరు 48.4 మి.మీ, ఇంకొల్లు 46.0 మి.మీ, చినగంజాం మండలంలో అత్యల్పంగా 47.6 మి.మీల వర్షపాతం నమోదైంది. దీంతో మండలాల్లో పోలీస్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. కారంచేడు మండలంలోని తిమిడెదపాడు-స్వర్ణ గ్రామాల మధ్యన రహదారి కోతకు గురయ్యింది. దీంతో రెండు గ్రామాల మధ్యన రాకపోకలను పోలీసులు నిలిపేశారు. రెవెన్యూ అధికారులు అక్కడే ఉండి రాకపోకలు జరగకుండా ముళ్ల కంపలు వేశారు. ఆదిపూడి-యర్రంవారిపాలెం గ్రామల మధ్యన కప్పల వాగు, దగ్గుబాడు సమీపంలో ఆలేరు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. గ్రామాల్లోని రహదారులు చిత్తడిగా మారాయి. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి నీరు చేరాయి.

■ ప్రస్తుతం పంటల సీజన్ ఇంక ప్రారంభం కాక పోవడంతో రైతులకు నష్టం లేక పోగా పంట భూములు సాగుకు అదునుగా మారాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం పంట భూములు నీటితో నిండి పోవడంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో వీధులు, లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం అయ్యాయి. పర్చూరులోని ఇందిరా కాలనీ, చీరాల రోడ్డు తదితర ప్రాంతాలలో భారీగా వర్షపు నీరు రోడ్డు పైకి వచ్చి చేరాయి. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో నీరు రోడ్లపైకి ప్రవహిస్తూ వాహన రాకపోకలకు అంతరాయం కలిగించాయి.

■ యద్దనపూడి మండలంలోని పోలూరు, యద్దనపూడి, వింజనంపాడు వద్ద ఉన్న వాగుల వద్ద ముందస్తు చర్యల్లో భాగంగా యద్దనపూడి పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈవర్షం పత్తి, జూట్, మొక్కజొన్న, పశుగ్రాసం వంటి పంటలకు జీవం పోసినట్లయింది.

■ ఇంకొల్లు గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాలలో వర్షపు నీరు రోడ్లపైకి వచ్చి చేరాయి. లోతట్టు ప్రాంతాలలో వర్షం నీరు నివాస గృహాల మధ్య నిలిచిపోయింది. ఎస్ఐ రమణయ్య ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఇంకొల్లు చుట్టు పక్కల గ్రామాల్లో ఉన్న వాగుల వద్ద నిఘా ఏర్పాటు చేశారు. దుద్దుకూరు వాగు తీవ్రంగా పొంగి ప్రవహిస్తుండటంతో సిబ్బంది ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చేశారు. అదే విధంగా వంకాయలపాడు అడ్డరోడ్డు వద్ద చెట్టు కొమ్మలను నరికి అడ్డుగా వేశారు.

■ మార్టూరు మండలంలో కురుస్తున్న పొగాకు, పత్తి, మిరప కూరగాయలు, తదితర ఉద్యానవన పంటలకు వర్షం ప్రయోజనకరంగా ఉంటుందని.. ఇప్పటివరకు కురిసిన వర్షం వలన పంటలకు ఎలాంటి నష్టం వాటిల్లిదని మండల వ్యవసాయ అధికారి వీ కిరణ్ కుమార్ తెలిపారు. జాతీయ రహదారిపై దీర్ఘకాలంగా హైవే అధికారుల నిర్లక్ష్యం కారణంగా డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడంతో స్టేట్ బ్యాంక్ సెంటర్‌లో మోకాళ్ల లోతు నీరు నిలిచి ద్విచక్రవాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

మెట్ట పంటలకు జీవం పోసిన వర్షం..

అద్దంకి/మేదరమెట్ల/జే.పంగులూరు/అద్దంకి రూరల్: వాయుగుండం ప్రభావంతో అద్దంకి నియోజకవర్గంలో ఎడతెరిపిలేని ముసురు వర్షం కురుస్తోంది. నిన్న మొన్నటి వరకు ఎండు ముఖం పట్టిన మెట్ట పంటలకు ఈ వర్షం జీవం పోసినట్లయింది. పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచింది. పల్లపు పొలాలు జలమయం అయ్యాయి. చేలల్లో వేసిన కుంటలు నిండిపోయాయి. అద్దంకిలో 67.4 మి.మీ సంతమాగులూరులో 92.8 మి.మీ అత్యధికంగా వర్షపాతం నమోదైంది. బల్లికురలో 77.4 మి.మీ, జే.పంగులూరులో అత్యల్పంగా 39.8 మి.మీ, కొరిశపాడులో 54.8 మి.మీ వర్షపాతం నమోదైంది. మొత్తం మీద రైతులు ఈ వర్షంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

■ అద్దంకి పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లోని రోడ్లపైన నీరు ప్రవహిస్తున్నాయి. అద్దంకి తహసీల్దార్ కార్యాలయంలో, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో, భవానిసెంటర్‌లోని కొన్ని ప్రాంతాల్లో నీరు నిలిచింది. పట్టణంలోని నామ్ రహదారిపై నీరు ప్రవహించి రాకపోకలకు అంతరాయం కలిగింది.

■ జే.పంగులూరు మండలంలోని పలు గ్రామాల్లో వీధులు నీట మునుగుతున్నాయి. రెండు రోజుల పాటు ఈ మాదిరిగానే వర్షాలు పడితే వాగులు, వంకలు పొంగిపొర్లి గ్రామాలు నీటి మునిగి నీరు ఇళ్లల్లోకి చేరుతుంది.

■ కొరిశపాడు మండలంలో మాత్రం అత్యల్పంగా వర్షం కురిసింది. ఈవర్షాలకు రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. అక్కడక్కడ కంది, జూట్, పశువుల మేత సాగు చేపట్టిన రైతులకు ఈ వర్షం ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

■ చినగంజాం మండలంలోని తీరప్రాంత గ్రామాలు, లోతట్టు ప్రాంతాలలో తహసీల్దార్ జీవి గుంట ప్రభాకరరావు, రెవెన్యూ సిబ్బందితో కలిసి పర్యటించారు. మండలంలోని మోటుపల్లి పంచాయతీ పరిధిలోని రుద్రమాంబ పురం, నిరీక్షణగిరి ప్రాంతాలను సందర్శించారు, సముద్ర తీరానికి వెళ్ళి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీటీ శ్రీకాంత్‌తో పాటు ఆయా గ్రామాల గ్రామ రెవెన్యూ అధికారులు, రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు.


ఆదిపూడి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కప్పలవాగు


కారంచేడు సమీపంలో ప్రవహిస్తున్న పర్చూరు వాగు


దుద్దుకూరు చప్టావద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది


పూసపాడు అడ్డరోడ్డు వద్ద రాకపోకలు నిలిపి వేసిన పోలీసులు


అద్దంకి: వర్షానికి నీరు చేరిన పొలంలోని కుంట


మార్టూరు స్టేట్ బ్యాంక్ సెంటర్‌లో రహదారిపై నిలిచిన వర్షపు నీరు


పర్చూరులోని కోట్ల బజారులో ఇళ్లల్లోకి చేరుతున్న వర్షపునీరు


అద్దంకి తహసీల్దార్ కార్యాలయంలో వర్షపు నీరు ఇలా..


చెరువులా మారిన ఈపురుపాలెం-బాపట్ల ప్రధాన రహదారి


అద్దంకి: వర్షానికి పారుతున్న మురుగు వాగు


జే.పంగులూరు: కాలనీల్లోకి చేరుతున్న వర్షపు నీరు

క్లుప్తంగా

డివైడర్‌ను ఢీకొన్న కారు



మేదరమెట్ల: కారు అదుపుతప్పి డివైడర్ కోసం ఉంచిన సిమెంటు దిమ్మెను ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం జాతీయ రహదారిపై పీ.గుడిపాడు వద్ద జరిగింది. అందిన వివారల మేరకు.. చెన్నై నుంచి విశాఖపట్నానికి వెళ్తున్న కారు కొరిశపాడు ఫ్లై ఓవర్ బ్రిడ్జి దాటి ఎమర్జెన్సీ ల్యాండింగ్ వద్దకు రాగానే కారు అదుపు తప్పి డివైడర్ కోసం ఉంచిన సిమెంటు దిమ్మెను ఢీకొంది. ఈప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న చిరువయ్య, శ్రీధర్, మధులకు రక్త గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న హైవే అంబులెన్స్ సిబ్బంది ఒంగోలు సంఘమిత్ర ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో కారులో ఐదుగురు ప్రయాణిస్తున్నారు.

సెప్టెంబర్ 14న లోక్ అదాలత్

చీరాల రూరల్: కోర్టులలో దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న కేసులను లోక్ అదాలత్‌ల ద్వారా రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పేర్కొన్నారు. శనివారం స్థానిక కోర్టు భవన సముదాయంలో న్యాయమూర్తి సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉన్నత న్యాయ స్థానాల ఆదేశాల మేరకు సెప్టెంబర్ నెల 14 చీరాల కోర్టు భవన సముదాయంలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈఅదాలత్‌లో రాజీ చేయదగిన అన్ని సివిల్, క్రిమినల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు, చెక్ బౌన్స్, ప్రామిసరీ నోటు కేసులు, యాక్సిడెంట్ కేసులు, భార్యాభర్తల వివాదాల కేసులు, బ్యాంకు, విద్యుత్ వంటి కేసులను రాజీమార్గంలో పరిష్కరిస్తామని తెలిపారు. రాజీ మార్గంలో పరిష్కరించిన సివిల్ కేసుల్లో ఫీజులను కూడా తిరిగి వాపస్ చేస్తామని చెప్పారు.

అధికారులు విధులు సక్రమంగా నిర్వహించాలి

- ప్రొటోకాల్ విషయంలో సమన్వయం చేయసుకోవాలి
- కౌన్సిల్ సమావేశంలో 18 అంశాలు ఆమోదం


కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్న చైర్మన్

చీరాల అర్బన్: మున్సిపల్ అధికారులు విధులను సక్రమంగా నిర్వహించి అందరిని సమన్వయం చేసుకుని పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ఎక్స్‌అఫిషియో మెంబర్‌గా ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య హాజరయ్యారు. సమావేశంలో కౌన్సిల్ అజెండాలోని పలు అభివృద్ధి పనులకు సంబంధించిన 18 అంశాలను కౌన్సిల్ ఆమోదించింది. అనంతరం మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ పట్టణాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించాలని మున్సిపల్ శాఖా మంత్రి ఉత్వర్వులు జారీ చేశారన్నారు. వీటిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగించేలా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించాలని మంత్రి సూచించారన్నారు. రోడ్లపై ఆవుల సంచారం ఎక్కువగా ఉండడంతో వాహనదారులకు, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ఆవుల యజమానులు వాటిని రోడ్డుపై వదిలివేస్తున్నారని ఈ సమస్యకు పరిష్కారం చూడాలన్నారు. కారంచేడు రోడ్డులోని ఎస్ఎస్ ట్యాంక్ వద్ద ఐదు ఎకరాల స్థలం ఉందని, ఆ స్థలంలో ఆవులను ఉంచాలన్నారు.

కమిషనర్‌కు ఎందుకంత అత్యుత్సాహం..

అలానే ఆగస్టు 15న మున్సిపల్ కార్యాలయంలో జరిగిన జాతీయ జెండా ఆవిష్కరణకు పట్టణ ప్రథమ పౌరుడు అయన తాను వచ్చే లోపు జెండా ఆవిష్కరించడంలో మున్సిపల్ కమిషనర్ అత్యుత్సాహం ప్రదర్శించారన్నారు. తాము ప్రజలచే ఎన్నుకోబడి ఈ స్థానంలో కూర్చొన్నామన్నారు. తమకు ఇవ్వాల్సిన ప్రొటోకాల్ పాటించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. అలానే ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్ ప్రారంభోత్సవానికి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిల్‌కు ఎటువంటి ఆహ్వానం లేదని, శిలాఫలకం ఆవిష్కరించకుండా ప్రొటోకాల్ పద్ధతిని పాటించడం లేదన్నారు. చీరాలలో ప్రశాంతత రాజకీయానికి అడ్డుకట్ట వేస్తున్నారని చైర్మన్ ఆరోపించారు. స్పందించిన ఎమ్మెల్యే ఆరోజు జరిగిన శిలాఫలకం ఏర్పాటు చేయలేదని, త్వరలో శిలాఫకలం ఏర్పాటు చేస్తామన్నారు. నియోజకవర్గానికి ప్రథమ పౌరుడిగా ఎమ్మెల్యే, మున్సిపాలిటీ ప్రథమ పౌరుడుగా మున్సిపల్ చైర్మన్ ఉన్నారన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కె.చక్రవర్తి, డీఈ ఐసయ్య, ఆర్వో, శానిటరీ ఇన్‌స్పెక్టర్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఆమోదం


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

అద్దంకి రూరల్: పట్టణాభివృద్ధికి సంబంధించిన అంశాలపై సభ్యులు ఆమోదించారు. శనివారం అద్దంకి మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ ఎస్తేరమ్మ అధ్యక్షత కౌన్సిల్ హాలులో సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభ సమయం 11 గంటలకు వర్షం కారణంగా ఎవరు రాకపోవటంతో చైర్మన్ వాయిదాను తెలిపారు. కాని అనంతరం 10 నిమిషాలకు కౌన్సిలర్లు వచ్చి సమావేశం నిర్వహించాలని కోరగా చైర్మన్ మళ్లీ సమావేశ హాలుకు వచ్చి సమావేశం ప్రారంభించారు. అజెండాలో ఉన్న పట్టణాభివృద్ధికి సంబంధించిన 34 అంశాలను మున్సిపల్ ఆర్ఐ అర్జున్ రావు చదివి వినిపించగా సభ్యులందరూ ఆమోదించారు. అజెండాలోని 11వ అంశమైన అద్దంకి మున్సిపల్ కార్యాలయంలో ఏపీసీవోఎస్ కింద పనిచేస్తున్న ఏడుగురు ఉద్యోగుల మార్పులు చేయాల్సిన అంశాన్ని సభ్యులు ఆమోదించలేదు. కార్యక్రమంలో కమిషనర్ సత్యనారాయణ, ఏఈలు సిబ్బంది పాల్గొన్నారు.

వర్షంతో నిర్మానుష్యంగా మారిన చీరాల


నిర్మానుష్యంగా మారిన చీరాల కారంచేడు గేటు బొమ్మల సెంటర్

చీరాల రూరల్: రెండు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షంతో చీరాలలో జన సంచారం నిర్మానుష్యంగా మారిపోయింది. లోతట్టు ప్రాంతాలన్నీ నీట మునిగిపోయాయి. పట్టణంలోని అన్ని రోడ్లు జలమయమయ్యాయి. చర్చిరోడ్డులో మోకాలు లోతున నీరు నిలిచిపోయింది. దీంతో వాహన దారులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. శాంతి నగర్, ఉజిలిపేట, విఠల్‌నగర్, బలహీన వర్గాల కాలనీ, శ్రీరాంనగర్, జాన్‌పేట, జయంతిపేట, మరియమ్మపేట, ఐక్యనగర్, విజయనగర్ కాలనీలలోని రోడ్లు జలమయమయ్యాయి. ఇళ్లల్లోకి నీళ్ల రావడంతో ప్రజలు ఎంతో ఇబ్బందులు పడ్డారు. ఆయా ప్రాంతాలన్నీ జన సంచారంలేక రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోయాయి. మరో రెండు రోజులు ఇదే విధంగా వర్షాలు పడనున్నాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది